# అతిథి

దిల్‌ఖుష్ గెస్ట్‌హౌస్ పైన గదిలో నిల్చుని కిటికీకి కట్టిన సిల్కు కర్టెన్‌ను తొలగించి చూసింది అన్నపూర్ణ.

హుస్సేన్‌సాగర్, బంతిలా పైకివస్తూన్న భానుడు, మరికాస్త కర్టెను వత్తిగించి చూసింది. 'హైదరాబాద్ నగర మెంత సౌందర్యమైనది, ప్రకృతి ఎంత రమణీయంగావుంది.' ఎన్నోసార్లు హైదరాబాదు చూడాలనుకుంది, కాని పడలేదు. ఇప్పుడు ప్రభుత్వ ఆహ్వానంపై వచ్చింది. ఎందుకో ఆమె పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

పంక్తినచివర కూర్చునేవాడు రచయిత. చివరి విస్తరి రచయితది. తను ఏపత్రికలోనో ఈ మాటలు చదివినట్లుగుర్తు. నిజమే అనిపిస్తుంది నిన్న జరిగిన సంఘటన తలుచుకుంటే.

తను ఉత్తమ తెలుగు సినిమా కథా రచయిత్రిగా ఆహ్వానింపబడింది. పది రోజుల ముందునుంచీ ఒకటే ఉత్తరాలు, టెలిగ్రాములు, ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్‌లు. 'మీరు ఎన్ని గంటలకు ఏ ట్రెయినులో ఈ ఊరు చేరుతారు, మేము స్టేషన్లో రిసీవ్ చేసుకుంటాం' అని.

తీరా తాను స్టేషన్లో దిగి దిక్కులుచూస్తూ నిల్చుండి పోయింది. తనకోసం ఎవరూ రాలేదు. ఐదూ, పది, పదిహేను నిమిషాలు ఎవరూ రాలేదు. ఇప్పుడు తానేంచెయ్యాలి ! ఇదివరకు ఒక పెద్దమనిషి తనను ఆహ్వానించి ఆ ఊరు పెద్దల తరపున సన్మానం చేసి ఎంతో గౌరవించారు. ప్రభుత్వంకనుక ఇంకా ఎంతో ఘనంగా జాగ్రత్తగా మర్యాదగా చూస్తారని అనుకుంటూంది తను. ఇదేమిటి? ఈ మహానగరంలో తనెవెళ్ళాలో తెలియదే.

కాస్త ఆలోచించి. ఒక హోటల్లో గది తీసుకుని ఆఫీసుకు ఫోనుచేసి "ఫలానా రచయిత్రిని" వచ్చి ఈ హోటల్లో ఇన్నో నెంబరు రూంలో ఉన్నానని వారికి మనవి చేసుకుంటే పదిగంటల ప్రాంతాన కరటక దమనకుల్లా ఇద్దరు ఆఫీసర్లు కారేసుకువచ్చి, అరె మీరు మాకు ట్రెయినులో కనుపించలేదే అన్నారు. మీరు గుర్తుపట్టలేదేమో; నేను బయటికి చూస్తూ కూర్చున్నాను అంది తను, తన తెలివికాని తానేం యాక్టరా వాళ్ళు చప్పున గుర్తుపట్టడానికి.

ఒకసారి "సారీ చెప్పి" సాయంత్రం బహుమతి ప్రదానం వేళకు వస్తానులెండీ. అంటే. కానేకాదని గెస్టు హౌసుకు తీసుకువచ్చారు ఆఫీసర్లు రాజమర్యాదలతో.

హోటల్లో ఉంటే మధ్యాహ్నం వేళకు తిండన్నా ఉండేది. సిల్కు కర్టెన్లు, కాశ్మీరు తివాసీలు చూస్తూ ఎంత సేపని కూర్చోవటం. మధ్యాహ్నం రెండయినా భోజనానికి పిలుపులేదు. వాళ్ళు పిలువరేమో? తానే వెళ్ళి తినాలేమో

అనుకొని. డైనింగ్ రూం ఎక్కడుందో కనుక్కొని అక్కడికి వెళ్ళి బాబూ భోజనం అని అక్కడ ఇద్దరు సినీ యాక్టర్లకు వడ్డన చేస్తూన్న అతన్ని అడిగితే ఎవరు మీరు? ఎన్నో నెంబరు గది? అని అడిగి మీ భోజనానికి ఆర్డరియ్యలేదు, అన్నాడతను. హతోస్మి అనుకుని వెనక్కు తిరిగి పోబోతుంటే రమ్మని మళ్ళీ పిలిచాడతను జాలేసిందేమో.

వేళతప్పిందేమో! ఆకలి చచ్చి నీరసంగా తలనొప్పిగా ఉంది. కొంచెం పెరుగూ అన్నం తిని లేచింది. ప్రభుత్వం చేసిన విందు ముగిసింది. సాయంత్రం మరొకచోట డిన్నరుకి పిలుపు వచ్చింది.

మధ్యాహ్నం మళ్ళీ ఆఫీసర్లు వచ్చారు. సాయంత్రం ఐదున్నరకు మీరు రెడీగా ఉంటే సభకు తీసుకువెళ్తామని చెప్పి వెళ్ళిపోయారు.

కాఫీ తెప్పించుకొని తాగి పెద్ద పట్టుచీర కడితే వేషంలా ఉంటుందని సామాన్యమైన చీర కట్టుకొని తయారయింది. మళ్ళీ నవ్వు వచ్చిందామెకు.

రవీంద్రభారతి ఇంద్రభవనంలా వెలిగిపోతూంది. లోపలికి ప్రవేశించబోయేముందు పూలగుత్తి చేతికందించారు. ఒక్కొక్కరినే లోపలికి పంపిస్తున్న ప్రభుత్వోద్యోగులతో చెప్పింది తను "నాకు అవార్డుందని" వాళ్ళు వినిపించుకునే స్థితిలో లేరు. తాము ఎంతకాలంగానో చూడాలనుకుని తహతహలాడుతున్న సినీతారలు వస్తున్నారు. వాళ్ళని అటు

ఒదిలేసి ఇటు ఊరికే చూడటానికి వచ్చే ప్రేక్షకుల దగ్గర ఉండిపోవటం చిరాగ్గా ఉంది పాపం.

ఈ కుర్చీలో కూర్చోండి అన్నాడతను ప్రేక్షకుల మధ్య కుర్చీ చూపిస్తూ, "నాకు అవార్డుంది" మరొకసారి చెప్పిందామె. ఆతను వినిపించుకున్నట్టు లేదు. వెళ్ళిపోయాడు కూర్చోండి అనేసి.

సినిమా తారలు, ఇంకా ఎందరో నిర్మాతలూ, దర్శకులూ వచ్చారు ప్రభుత్వ ఆహ్వానంపై, వారంతా అలా స్టేజివైపు లోపలికి వెళ్ళిపోతున్నారు. తాను ప్రేక్షకులలో కూర్చుంది. ఏమో వాళ్ళు జనంలో కూర్చుంటే బ్రతకనిస్తారా ? అందుకని లోపల కూర్చోబెడతారేమో! తర్వాత పిలిచి అవార్డిస్తారా తనకు! స్కూల్లో పిల్లల్ని పిలిచి ప్రైజులిచ్చినట్లు, ఏమిటో అప్పుడు బుర్రంతా గందరగోళంగా తయారయింది.

స్టేజీమీద తెర తొలిగింది. తారాగణం పట్టుచీరల్తో ప్రత్యక్షమయ్యేసరికి ప్రేక్షకుల్లో గుసగుసలు. అదిగో, ఆమె అతను అంటూ.

అధ్యక్షులు కాబోలు మొదటి ప్రసంగం. అందులో "రచయిత" పేరు ఉచ్చరింపబడలేదు. తర్వాతాయన "రచయితలు" అన్నారు,

తర్వాత బహుమతిప్రదానం. గబగబా జరిగిపోతూంది. స్టేజీమీద కూర్చున్నవారే ముందుకు వచ్చి బహుమతులు స్వీకరించి వెనక్కి వెళ్ళి కూర్చుంటున్నారు. తనకు కోపం

వచ్చింది. నవ్వొచ్చింది. ప్రభుత్వోద్యోగులు కూడా మత్తులో పడి బహుమతులు వచ్చినవాళ్ళంతా స్టేజీమీద వున్నారా! లేదా! అని గమనించలేదు. పాపం వాళ్ళు మాత్రం ఋషులా: సామాన్యులయిన మగవాళ్ళే. తన పేరు ఎనౌన్సు అయిపోయింది. అప్పుడు తాను స్టేజిమీదకు ఎలా వెళ్ళగలదు. ప్రేక్షకుల మధ్య నుంచి స్టేజిదగ్గరకు వెళ్ళి, వాలంటీరుతో చెప్పింది జరిగిన విషయం.

అతను కంగారుపడిపోయాడు. దబదబా బాదిద్వారం తెరిపించి ఆమెకో కుర్చీ స్టేజీమీద వేసి కూర్చోబెట్టారు. వారి ముఖాల్లో ఏదో బెదురూ భయం కనిపించాయి. నిజమే మరి తలమున్కలున్నవాళ్ళు. పొరపాటు జరగకూడదు. పోన్లే పాపం తనకో కథకు చిన్న ప్లాటిచ్చారు. "మళ్ళీ మీ పేరు ఎనౌన్సు చేస్తారు, చెప్పాం" అన్నాడు ఒకతను. చివరన అందరికీ బహుమతి ప్రదానం అయిపోయిన తర్వాత, మరొకసారి అన్నపూర్ణ పేరు ఎనౌన్సు చేశారు. అవార్డు, బహుమతి తీసుకుంది తను. ఆఖర్న ఎందుకు తీసుకుంది ఈవిడ! అనే ప్రశ్న చాలామంది బుర్రల్ని తొలుస్తుంది ఈ కథ వారికెలా తెలుస్తుంది.

తనకి మాట్లాడే అలవాటు లేదు. ఒకవేళ మాట్లాడమని అడిగినా నమస్కారం పెట్టేసేది కాని మరొక రచయిత బాధపడటం విన్నది. నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని! రచయిత పంక్తి చివర విస్తరివాడయ్యా అంది తను. నిజమే ప్రతివాడూ కథ రాసేస్తున్నాడన్నాడతను. అతనూ మనస్సులో నవ్వుకున్నాడు. రచయితకి పంక్తి చివరి విస్తరికూడా

లేదని అతని అనుమానం. ఎందుకంటే ప్రభుత్వ ఆహ్వానంపై నగరం విచ్చేసిన కళాకారులందరినీ ఓ పెద్దమనిషి విందుకి పిలిచి రచయితలని పిలవలేదట.

పైపైకి వస్తూన్న రవి కిరణాలు చురుగ్గా వేడిగా వున్నాయి. ఎవరో గదిలోకి వస్తూన్నట్లు అడుగుల సవ్వడి. వెనుదిరిగి చూసింది అన్నపూర్ణ.

నిన్నటి ఆఫీసర్లు. ఆమె పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. నమస్కార ప్రతినమస్కారాలయ్యాక "నేను ఇప్పుడు వెళ్ళిపోతున్నాను" చెప్పిందామె.

ఎవరెవరో సాయంత్రం వరకూ ఉంటున్నారు. మీరు ఉండి పరిసర ప్రాంతాలు చూడండి, అన్నారు వాళ్ళు మర్యాదలు ఒలకపోస్తూ.

ఇంకోరోజు తాను అక్కడ ఉంటే ఎవరి సొమ్ము ఖర్చు! వీరిదా! కాదు ప్రజల సొమ్ము.

లేదు వెళ్ళిపోతాను అంది అన్నపూర్ణ. వారు నిన్నటి హోటల్ కి కారులో తీసుకువచ్చి దిగవిడిచారు.

తిరుగుప్రయాణమై రైలు ఎక్కుతూ మళ్ళీ మళ్ళీ ఇటువంటి గౌరవంపొందే అదృష్టం ప్రసాదించు భగవాన్, శక్తి ప్రసాదించు అని దైవానికి మొక్కింది అన్నపూర్ణ.